క్లుప్తంగా

జగనన్న కాలనీలో కమిషనర్ పర్యటన



సామర్లకోట జగనన్న కాలనీవాసులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య

సామర్లకోట: మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య సోమవారం స్థానిక జగనన్న కాలనీలో పర్యటించారు. కాలనీ వాసుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వర్షం వచ్చిన సమయంలో వీధులన్నీ బురదమయంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత మూడు రోజులుగా బురదనీరు వస్తుందని కాలనీ వాసులు కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని, వాటర్ ట్యాంకరు ద్వారా నీటిని సరఫరా చేయాలని ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. బురదనీరు రావడానికి పైపులైన్ల లీకులు కారణంగానే ఇటువంటి సమస్యలు ఏర్పడే అవకాశం ఉందని లీకులను గుర్తించాలని సూచించారు.

నేటి నుంచి మందిర ప్రతిష్ఠ మహాసభలు

పెద్దాపురం: హౌస్ ఆఫ్ హౌస్ చర్చి ఆరో వార్షికోత్సవం సందర్భంగా మందిర ప్రతిష్ఠ మహాసభలు స్థానిక లూథరన్ హైస్కూల్లో మంగళవారం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని చర్చి పౌండర్ స్టీఫెన్ చందు, క్లాప్స్ అధ్యక్షుడు లంక పురుషోత్తమదాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలు 3, 4, 5 తేదీల్లో జరగనున్నాయి. ఈ సభల్లో దైవజనులు టి.జెపన్యాశాస్త్రీ (విశాఖపట్టణం), జాన్ మంగాచార్యులు (కృష్ణాజిల్లా), జార్జిబుష్ (విజయవాడ)లు వాక్యోపదేశం అందిస్తారన్నారు. ప్రతీ ఒక్కరూ ఈ సభల్లో పాల్గొనాలని కోరారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం



ఉప్పాడలో శంకుస్థాపన చేస్తున్న ఎంపీ శ్రీనివాస్, ఎమ్మెల్సీ హరిప్రసాద్

కొత్తపల్లి: రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యమని ఆ దిశగా ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి పనిచేస్తున్నారని కాకినాడ ఎంపీ తంగేళ్ల శ్రీనివాస్, ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ అన్నారు. మండలంలోని ఉప్పాడలో ఉపాధి హామీ పథకం నిధులు రూ.36.50 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు సోమవారం వారు శంకుస్థపన చేశారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణం, వాకతిప్పలో ఉన్న చెరువు గట్టుపై మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్, డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్, సర్పంచులు, ఎంపీటీసీలు, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పౌష్టికాహార లోపంపై అవగాహన



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ దుర్గాదేవి

కొత్తపల్లి: గర్భిణులు, బాలింతలు, చిన్నారులను వేధిస్తున్న పౌష్టికాహార లోపంపై అవగాహన కల్పించాలని సీడీపీఓ దుర్గాదేవి అన్నారు. పిఠాపురంలో ఉన్న ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో సోమవారం పోషణ అభియాన్ రాష్ట్రీయ పోషకాహార వారోత్సవాల కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యుడు బి.జయరామ్ మాట్లాడుతూ పోషకార లోపం ఏ విధంగా గుర్తించాలి, ఏయే పౌష్టికాహారం తీసుకోవాలో తెలియజేశారు. ముఖ్యంగా పౌష్టికాహార లోపం వలన అనేక సమస్యలను ఎదుర్కోవ వలసి వస్తుందన్నారు. దుర్గాదేవి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో అందించే పౌష్టికాహారాన్ని ప్రతి నెలా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ చిన్నారావు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఘనంగా డిప్యూటీ సీఎం పవన్ పుట్టిన రోజు వేడుకలు



సామర్లకోట మండలం హుస్సేన్‌పురంలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రాజప్ప

సామర్లకోట: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పుట్టిన రోజు వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించా హుస్సేన్‌పురం గ్రామంలో చల్లా బుజ్జి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభించారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటారు. పవన్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



కాండ్రకోటలో నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ తదితరులు



సామర్లకోటలో రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన చైర్‌పర్సన్, వైస్‌చైర్‌పర్సన్ తదితరులు



సామర్లకోట మండలం ఉండూరు గ్రామంలో నివాళులు అర్పించిన మండల పార్టీ అధ్యక్షుడు తదితరులు



ఉప్పాడలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న నాయకులు

చిరస్మరణీయుడు వైఎస్సార్

- కొనియాడిన వక్తలు
- వైఎస్ రాజశేఖరరెడ్డికి ఘన నివాళులు

పెద్దాపురం: ప్రజల కోసం ఎన్నో పథకాలు అమలు చేసిన మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని, అటువంటి మహానేత పాలన మళ్లీ రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యపడుతుందని మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు అన్నారు. దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని సోమవారం పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. స్థానిక మున్సిపల్ సెంటర్, సినిమా సెంటర్, కాండ్రకోట, సిరివాడ, ఉలిమేశ్వరం వద్ద ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు, గుడివాడ, కట్టమూరు, ఆర్‌బీకొత్తూరు గ్రామాల్లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటాలకు వైఎస్సార్ సీపీ నాయకులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల యూత్ అధ్యక్షులు గోపు మురళి, సయ్యద్ జానీ, పట్టణ అధ్యక్షుడు కాపగంటి కామేశ్వరరావు, కౌన్సిలర్లు త్సలికి సత్య భాస్కర్, విజ్జపు రాజశేఖర్, ఆకుల కృష్ణబాపూజీ, పెంటకోట సత్తిబాబు, తాటికొండ వెంకటలక్ష్మి, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, తలారి దర్మేంద్ర, ఉప సర్పంచ్ గోలి రామారావు, పార్టీ నాయకులు గుర్రాల యాకోబు, జాలా దావీదు, ముమ్మన ప్రకాష్, చింతా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. కాండ్రకోటలో వైఎస్సార్ వర్ధంతిని నిర్వహించారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు గ్రామ నాయకులతో కలిసి వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీనివాస్, ఉప సర్పంచ్ జోకా నానాజీ, ఎంపీటీసీ భద్రరావు, గవరసాని వీరాస్వామి, పల్ల గంగారావు, గంటా రామస్వామి, ఒబిలిశెట్టి వెంకటేశ్వరరావు సిద్ధాంతి, గవరసాని రాజశేఖర్, లక్కాలకు కృష్ణ, పీతా రాజు తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ సెంటర్‌లో వైఎస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న చైర్మన్, వైస్ చైర్మన్

సంక్షేమ పథకాల ప్రదాత వైఎస్సార్

సామర్లకోట: రాష్ట్రంలో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిన ఘనత దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టరు వైఎస్ రాజశేఖర రెడ్డికే దక్కిందని మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, ఉబా జాన్ మోజెస్ అన్నారు. పట్టణం, మండల గ్రామాల్లో వైఎస్సార్ వర్ధంతిని నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కంటే వీర్రాఘవరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు మద్దాల శ్రీను, కార్యదర్శి సేపెని సురేష్, చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్‌చైర్మన్ ఉబా జాన్‌మోజెస్‌ల ఆధ్వర్యంలో ప్రసన్నాంజనేయస్వామి, రాజీవ్ గృహకల్ప, ఫ్లైఓవర్ బ్రిడ్జిలపై ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులు, గర్భిణులు, బాలింతలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. బడేలమ్మ చెరువు వద్ద ఉన్న సిరి మానసిక దివ్యాంగుల కేంద్రంలోని విద్యార్థులకు దొరబాబు పండ్లు, రొట్టెలు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర పార్టీ కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, వైస్ చైర్‌పర్సన్ 2 గొకిన సునేత్రాదేవి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మన్యం చంద్రరావు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు వైఎస్సార్ యువసేన ఉమ్మడి జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీనివాసు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. వేట్లపాలెం గ్రామంలో వైఎస్సార్ విగ్రహానికి ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. మాధవపట్నం గ్రామంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిశెట్టి వీరభద్రం ఆధ్వర్యంలోనూ, ఉండూరు గ్రామంలో మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, గ్రామ ఉప సర్పంచ్ కొప్పిరెడ్డి రాధాకృష్ణ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. పవర, నవర, వీకే రాయపురం తదితర గ్రామాల్లో వైఎస్సార్ వర్ధంతి వేడుకలను జరుపుకొన్నారు.



చేబ్రోలులో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న నాయకలు

కొత్తపల్లి మండలంలో..

కొత్తపల్లి: దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఉప్పాడ బీచ్‌రోడ్డు సెంటర్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఎల్లాజీ, బొందు రాంబాబు, గోగు బుజ్జి, వాకతిప్ప సర్పంచ్ పాలాని దొరబాబు, గోపి హరిబాబు తదితరులు పాల్గొన్నారు. నాగులాపల్లిలో ఉన్న వైఎస్సార్ కాంస్య విగ్రహానికి వైఎస్సార్ సీపీ నాయకుడు వడిశెట్టి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుర్రాల చిరంజీ కుమార్, వడిశెట్టి రామకృష్ణరెడ్డి, అబ్బిరెడ్డి సుబ్బిరెడ్డి, కూనిశెట్టి నీలారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు మండలంలో..

పిఠాపురం: గొల్లప్రోలు మండలంలో దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. చేబ్రోలు ఉన్న వైఎస్సార్ విగ్రహానికి జెడ్పీటీసీ వులవకాయల నాగలోవరాజు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పుప్పాల బాబులు, పడాల ప్రభాకర్, ఇసరపు రామకృష్ణ, ఓరుగంటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో చెరగని ముద్ర

పిఠాపురం: తన పాలనతో ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్న మహనీయుడు దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి అని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత అన్నారు. పిఠాపురంలో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సెల్ ఫోన్ ఉంటేనే వైద్యం

- సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగుల తిప్పలు
- డాక్టరును నిలదీసిన కౌన్సిలర్ హరిబాబు

సామర్లకోట: సామాజిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు సెల్ ఫోన్ ఉంటేనే వైద్యం చేస్తామని చెప్పడం వింతగా ఉందని సీనియర్ కౌన్సిలర్ నేతల హరిబాబు ఆరోపించారు. సోమవారం స్థానిక పెన్షన్‌లైన్‌లో ఉన్న ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి రోగులు తరలి వచ్చారు. వారికి సెల్‌ఫోన్ ఉంటేనే వైద్యం చేస్తామని ఆరోగ్య కేంద్ర సిబ్బంది చెప్పడంతో రోగులు ఇబ్బందులకు గురయ్యారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ కొత్త విధానం ఏమిటని హరిబాబు ప్రశ్నించారు. సెల్ ఫోన్‌కు ఆధార్ అనుసంధానమై ఉండాలని పేర్కొనడం మరింత విడ్డూరంగా ఉందని ఆరోపించారు. పేద, సామాన్య ప్రజలు ఎక్కువగా ప్రభుత్వ ఆస్పత్రికి వస్తారని, కొన్ని సమయాల్లో సీరియస్ కేసులతో ఆస్పత్రికి వచ్చే అవకాశం ఉంటుందని వారికి వైద్యం చేయరా అని ఆస్పత్రి సూపరింటెండెంట్ అమలను ప్రశ్నించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సెల్ ఫోన్ నెంబరు రిజిస్టర్ చేయాలని, ఆ సమయంలో సెల్‌ఫోన్‌కు ఓటీపీ వస్తుందని దానిని చెప్పవలసి ఉంటుందని వైద్య సిబ్బంది చెప్పుతున్నారని హరిబాబు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చేవారు పేదలే ఎక్కువగా ఉంటారని, అందరి దగ్గర సెల్‌ఫోన్లు ఉండవని, ఉన్నా వారికి ఓటీపీలు చూడడం రాదని ఎప్పుడు ఏంటి పరిస్థితి అని హరిబాబు ప్రశ్నించారు. పేదలను ఇబ్బంది పెట్టే వైద్య విధానం మారాలని వైఎస్సార్ సీపీ నాయకులు మద్దాలి శ్రీను, గంగిరెడ్డి కృష్ణమూర్తి, పాలిక చంటిబాబు, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ వారా సుధాకర్ డిమాండ్ చేశారు. దీనిపై జిల్లా వైద్యాధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని హరిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు డిమాండ్ చేశారు.



సామర్లకోట సామాజిక ఆరోగ్య కేంద్రం డాక్టరు అమలను ప్రశ్నిస్తున్న హరిబాబు తదితరులు

వైద్యం నిరాకరణ వాస్తవం కాదు



డాక్టరు అమల

సామర్లకోట: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో సెల్‌ఫోన్ లేకపోతే వైద్యం చేయడం లేదనే ప్రచారంలో వాస్తవం లేదని ఆస్పత్రి సూపరింటెండెంట్ అమల అన్నారు. సెల్‌ఫోన్ లేక పోతే ఇక్కట్లు అని సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో ఆమె స్పందించారు. అబా ఐడీ జనరేట్ ద్వారా రోగుల ఓపీ నమోదు అన్ని ఆస్పత్రుల్లో ఉందని, దాని ప్రకారమే తాము ఈ నమోదు చేస్తున్నట్టు చెప్పారు. అయితే సెల్‌ఫోన్ లేని వారికి ఆస్పత్రి ఫోన్ ద్వారా ఈ రిజిస్ట్రేషన్ చేస్తున్నామని, దానికి కొంత సమయం పడుతుండడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. సెల్‌ఫోన్ లేకపోతే వైద్యం చేయమని ఏ సిబ్బంది చెప్పడం లేదని, దీనిపై రోగుల ఇబ్బందులపై ఇప్పటికే జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకొని వెళ్లామని చెప్పారు. దాంతో రోగులు వేచి ఉండేందుకు ఏర్పాటు చేసేందుకు ఆయన చర్యలు చేపడుతున్నారని అన్నారు. ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందజేయడానికి కృషి చేస్తున్నామన్నారు. రక్త పరీక్షల విషయంలో ప్రభుత్వం అందించే పరీక్షల కిట్లు ఉన్నాయని, ఇతర పరీక్షలకు బయట నుంచి కిట్లు కొనితెచ్చి పరీక్షలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు, ఓపీ ఆన్‌లైన్ ఇబ్బంది మినహా ఆస్పత్రిలో ఎటువంటి ఇబ్బందులు లేవని ఆమె స్పష్టం చేశారు.

నీట మునిగిన పంటపై జాగ్రత్తలు

ఉద్యానశాఖాధికారి మల్లికార్జునరావు

పిఠాపురం: ప్రస్తుత వరదల్లో నీట మునిగిన వాణిజ్య పంటలకు సంబంధించి రైతులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా ఉద్యానశాఖాధికారి ఎన్.మల్లికార్జునరావు సూచించారు. ఆయన సోమవారం పిఠాపురం ఉద్యానవన శాఖాధికారి కె.సత్యశైలజతో కలిసి గొల్లప్రోలు మండలం చెందుర్తి గ్రామ పరిధిలో నీటమునిగిన వాణిజ్య పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వీలైనంత త్వరగా వాణిజ్య పంటల్లో కాయకోత చేసుకుని పంటలను ఒబ్బిడి చేసుకునే ప్రయత్నం చేయాలన్నారు. నీరు బయటకు పంపే ఏర్పాటు చేసుకుని వెంటనే తెగుళ్ల నివారణకు మందులు పిచికారీ చేసుకోవాలన్నారు. వరద ప్రవాహం వల్ల నేలలో పోషకాలు కొట్టుకు పోతాయని, అందువల్ల ఎరువులను వేసుకోవాలని సూచించారు.



చెందుర్తిలో పంటలను పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖాధికారులు

సోషల్ ఆడిట్ నిర్వహణపై సమావేశం

కొత్తపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్ నిర్వహణపై కో ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వెంకట నారాయణ మాట్లాడుతూ జరిగిన ఉపాధి పనులపై సోషల్ ఆడిట్ సిబ్బంది గ్రామాల్లో తిరిగి పనుల పరిశీలన, అందిన వేతనాలు, పనులపై తనిఖీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ భాస్కరరావు, ఏపీఓ కొండల రావు, మండల ఇంజినీరింగ్ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గణపతి నవరాత్ర ఉత్సవాలపై అప్రమత్తంగా ఉండాలి

- మంటపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి
- పెద్దాపురం ఆర్డీఓ జేఎస్ రామారావు

పెద్దాపురం: ఈ నెల ఏడో తేదీ నుంచి నిర్వహించే గణపతి నవరాత్ర ఉత్సవాలపై ప్రశాంతంగా జరిగేలా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పెద్దాపురం ఆర్డీఓ జేఎస్ రామారావు ఆదేశించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ జేఎస్ రామారావు మాట్లాడుతూ డివిజన్ పరిధిలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే గణపతి నవరాత్ర మండప ఏర్పాట్లకు ఆయా ఆలయ కమిటీలు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు, ఉత్సవాలపై పోలీస్ శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు ఉంటుందన్నారు టువంటి అసాంఘిక కార్యక్రమాలకు తావు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ప్రశాంత వాతావరణంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించాలని ఆర్డీఓ జేఎస్ రామారావు సూచించారు. అనంతరం పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు.ఈ సమావేశంలో పెద్దాపురం తహసీల్దార్ వెంకటలక్ష్మి, సీఐ టి.క్రాంతికుమార్, ఎస్‌ఐ మౌనిక. ఆయా మండలాల తహసీల్దార్లు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పెద్దాపురం ఆర్డీఓ జేఎస్ రామారావు

పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి

పెద్దాపురం: భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న క్లయిమ్స్ బిల్లులను సత్వరమే విడుదల చేయాలని ప్రైవేట్ ఎలక్ట్రికల్స్ యూనియన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో సోమవారం తాటిశెట్టి గంగ అధ్యక్షతన ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం గౌరవాధ్యక్షుడు చింతల సత్యనారాయణ మాట్లాడుతూ చేతి వృత్తులు విచ్ఛిన్నమైన తరువాత భవన నిర్మాణ రంగమే అధిక శాతం మంది యువతకు ఉపాధి కల్పిస్తుందన్నారు. భవన నిర్మాణ రంగంలో ఉన్న అన్ని విభాగాల కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా అనేక సంక్షేమ పథకాలు అమలు జరిగేవన్నారు. సంక్షేమ బోర్డు సక్రమంగా పని చేయకపోవడంతో కార్మికుల సంక్షేమ పథకాలు అమలు కావడం లేదన్నారు. సంక్షేమ బోర్డును మరింత బలోపేతం చేసేందుకు సంక్షేమ పథకాలు అమలు చెయ్యాలన్నారు. ఈ కార్యక్రమంలో పెదిరెడ్ల విష్ణు, కందరెళ్ల దుర్గాప్రసాద్, బూసారి శ్రీను, జోకా సూర్యనారాయణ, నూకతట్ట వెంకటరమణ, కోనాల కుమార్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

వాహనాల వేలం

కాకినాడ క్రైం: సారా కేసుల్లో పట్టుకున్న వాహనాలకు మంగళవారం వేలం నిర్వహించనున్నట్టు కాకినాడ పోర్టు పీఎస్ సీఐ సునీల్ కుమార్ సోమవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. పోర్టు పీఎస్‌లో ఉదయం 10 గంటలకు రెండు బోట్లలో పాటు ద్విచక్రవాహనాన్ని వేలం వేయనున్నట్లు తెలిపారు.

వినాయక చవితికి సన్నాహాలు

- ముస్తాబవుతున్న బొజ్జ గణపయ్య
- 7 నుంచి ప్రారంభంకానున్న గణపతి నవరాత్రులు

కొత్తపల్లి: వినాయక చవితి సంబరాలకు గణనాథులు సిద్ధమవుతున్నారు. ఈ నెల ఏడో తేదీ నుంచి నిర్వహించనున్న వినాయక చవితి నవరాత్ర ఉత్సవాలకు ఏర్పాట్లు జోరుగా జరుగుతున్నాయి. ఉత్సవాల ఊపు ఈసారి బాగానే కనిపిస్తుండడంతో వినాయక విగ్రహాలకు మరింత గిరాకీ పెరిగిందని కమిటీ సభ్యులు చెబుతున్నారు. నియోజకవర్గంలోని కొత్తపల్లి, పిఠాపురం, గొల్లప్రోలు మండలాలతో పాటు పిఠాపురం టౌన్, గొల్లప్రోలు నగరపంచాయతీలో సుమారు 1500 వరకూ విగ్రహాలను ఏర్పాట్లు చేసేందుకు ఉత్సవ, ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఉత్సవాలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాలకు రంగులు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరిస్తున్నారు. మండపాలను వివిధ రకాల ఆకృతులతో ఏర్పాట్లు చేస్తున్నారు. పిఠాపురం, సామర్లకోట, కాకినాడ, రాజమండ్రి పట్టణాలకు వెళ్లి విగ్రహాలను కొనుగోలు చేస్తున్నారు. రూ.20వేల నుంచి రూ.25 వేలు విలువ చేసే విగ్రహాలను ఉత్సవ కమిటీ సభ్యులు కొనుగోలు చేస్తున్నారు. భారీస్థాయిలో నిర్వహించేందుకు కమిటీలు ఉత్సాహాన్ని చూపుతున్నయి. భారీ స్థాయిలో విగ్రహాలతో పాటు సెట్టింగులు వేస్తున్నారు. అదేవిధంగా ప్రతిరోజూ ఆలయాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు, నిమజ్జన సమయంలో ఏర్పాటు చేసే కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు.



గోర్సలో గణపతి నవరాత్రి ఉత్సవాలకు మందిరాన్ని సిద్ధం చేస్తున్న యువత



కొత్తపల్లిలో గణపతి ఉత్సవాలకు విద్యుద్దీపాలను అంలంకరిస్తున్న భక్తులు

అనుమతులు తప్పనిసరి



ఈ నెల 7తేదీ నుంచి ప్రారంభం కానున్న గణపతి నవరాత్ర మహోత్సవాలకు అనుమతులు తప్పనిసరి. ఏర్పాటు చేసే మందిరాలకు కమిటీ సభ్యులు ముందస్తుగా అనుమతులు తీసుకోవాలన్నారు. మైక్ అనుమతి ఉండాలి. ఉత్సవాలలో భాగంగా నిర్వహించే కార్యక్రమాలు, నిమజ్జనం విషయాలను కమిటీ సభ్యులు రాతపూర్వకంగా తెలియజేయాలి. ఉత్సవాలలో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే చర్యలు తప్పవు.

– వెంకటేష్, ఎస్సై కొత్తపల్లి

సొమ్ము కట్టాక.. ప్లాట్ మంజూరు కాలేదంటున్నారు..

కాకినాడ సిటీ: ప్రభుత్వ టిడ్కో ప్లాట్ ఇస్తామంటే రూ.4.65 లక్షలు కట్టానని తనకు టిడ్కో ప్లాటు మంజూరు కాలేదని, అధికారుల వద్దకు తిరుగుతున్నా ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదంటూ కాకినాడ 27వ డివిజన్‌కు చెందిన పిల్లి సూర్యచంద్రకుమారి డీఆర్వో తిప్పేనాయక్‌ను కలిసి తమ గోడును వెల్లబుచ్చుకున్నారు. సోమవారం గ్రీవెన్స్ రద్దు అనే విషయం తెలియక కలెక్టరేట్‌కు వచ్చిన ఆమె విలేకరులకు తన గోడును వివరించారు. విషయాన్ని తెలుసుకున్న పౌరసంఘం నాయకులు దూసర్లపూడి రమణరాజు, యెనిమిరెడ్డి మాలకొండయ్య, రంబాల వెంకటేశ్వరరావులు సూర్యచంద్రకుమారిని డీఆర్వో వద్దకు తీసుకెళ్లారు. ఆమె చెప్పిన విషయాన్ని విని, రికార్డులను పరిశీలించిన డీఆర్వో తిప్పేనాయక్ హౌసింగ్ బోర్డు అధికారులు మాట్లాడి సమస్య పరిష్కరించాలని, అనంతరం సమస్య పరిష్కార వివరాలను తమకు పంపాలని కోరుతూ కలెక్టరేట్ నుంచి బట్వాడా చేశారు. నాలుగు రోజులు తరువాత హౌసింగ్ అధికారిని కలుసుకోవాలని ఆమెకు డీఆర్వో వివరించారు. పదేళ్ల కాలంగా ప్లాట్ కోసం రూ.4.65 లక్షల జమ చేసి తెచ్చిన డబ్బుపై వడ్డీ చెల్లించలేక, ప్లాట్ లభించక తీవ్ర అనారోగ్యానికి గురయ్యామన్నారు. టిడ్కో ప్లాట్ కోసం డబ్బు చెల్లించిన బాధితుల కోసం ప్రత్యేక కార్యాచరణ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.